ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలో.. (రూపాయల్లో).. టమాటా రూ.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 21, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 15, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆస్పత్రులు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఆయుష్ క్లినిక్‌లు, పాలీక్లినిక్‌లు, ఆసుపత్రులు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. ప్యాట్నీ సెంటర్‌లోని తమ కార్యాలయంలో దరకాస్తులు సమర్పిస్తే 10 పనిదినాల్లో ఆయా కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

మరో అవకాశం..

నామినేషన్ ప్రక్రియ మొదలయ్యేవరకు ఓటరు నమోదు ప్రక్రియ

- 85 ఏళ్లు నిండిన వారికి హోమ్ ఓటింగ్..
- రెండున్నర లక్షలు దాటిన సనత్‌నగర్ నియోజకవర్గ ఓటర్లు
- యువ ఓటర్ల నమోదుతో మరింత పెరిగే చాన్స్..

సనత్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చింది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఆ మేరకు దరఖాస్తు చేసుకోవాలని సనత్‌నగర్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి (ఈఆర్‌ఓ), బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య సూచించారు. నియోజకవర్గం పరిధిలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 229 పోలింగ్ బూత్‌ల పరిధుల్లో ఉన్న అర్హులైన కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. ఈ దిశగా అవగాహన కార్యక్రమాలు కూడా కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ మూడో వారం వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఈఆర్‌ఓ తెలిపారు.

రెండున్నర లక్షలు దాటిన ఓటర్లు..

సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ఓటర్లు రెండున్నర లక్షలు దాటారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా గత ఏడాది జనవరి 5న ప్రచురించిన ఓటరు తుది జాబితా ప్రకారం 2,44,946 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత మూడు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబర్ 10న ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం 2,49,022 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఇక ఈ ఏడాది జనవరి వరకు నిర్వహించిన ఎస్ఎస్ఆర్‌లో భాగంగా జనవరి 6న ప్రచురించిన తుది జాబితా మేరకు 2,50,512 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే గత నెల ఫ్రిబవరి 8 నాటికి 2,52,530 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో పురుషులు 1,30,853, మహిళలు 1,21,667, థర్డ్ జెండర్ 10 మంది ఉన్నారు. అంటే గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు 3,508 కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. ఏప్రిల్ 1 వరకు అవకాశం ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరగడం తథ్యం.

పోలింగ్ శాతం పెంచే దిశగా..

పోలింగ్ శాతం పెంచే దిశగా అధికారులు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తున్నారు. కళాశాలలు, ఇనిస్టిట్యూట్‌లలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు సమాయత్తమవుతున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో 60 శాతం పోలింగ్ దాటడం లేదు. ఈ నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

85 ఏళ్లు నిండిన వారికి హోమ్ ఓటింగ్..

85 ఏళ్లు నిండిన వారికి హోమ్ ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. ఏప్రిల్ 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించింది. మరో మూడు రోజుల్లో హోమ్ ఓటింగ్ దరఖాస్తుల స్వీకరణ మొదలుపెడతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఏ వయస్సు వారు ఎంతమంది అంటే..

ఈ ఏడాది జనవరి 6న ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం వివిధ వయస్కుల వారి ఓటర్లు ఈ విధంగా ఉన్నారు.

వయస్సు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
18–19	1736	1419	0	3155
20–29	18117	16304	3	34424
30–39	36026	33040	3	69069
40–49	30309	28088	2	58399
50–59	20816	19352	0	40168
60–69	12839	12269	1	25109
70–79	7005	6704	0	13709
80 ప్లస్	3193	3286	0	6479

ఓటరు నమోదు చేసుకోండి..



కొత్త వారికి మరో అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. 18 ఏళ్లు నిండిన వారంతా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. యువతను ఇందు కోసం సన్నద్ధం చేస్తున్నాం.

– సమ్మయ్య, సనత్‌నగర్ ఈఆర్‌ఓ, బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్.

ఓయూ విద్యార్థుల కొత్త పార్టీ?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి నేతలు కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఓయూ విద్యార్థి నేతలకు కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల్లో మొండి చేయి చూపింది. తొలుత అసెంబ్లీ ఎన్నికలు, తరువాత పార్లమెంట్ ఎంపీ టిక్కెట్లు ఆశించి దరఖాస్తు చేసుకున్నారు. అయినా ఒక్క విద్యార్థి నేతకు కూడా ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసే అవకాశం దక్కలేదు. చివరకు నామినేటెట్ పదవుల కోసం ఎదురు చేశారు. అయినా ఇటీవల 37 నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఒక్కరికి కూడా అవకాశం దక్కదలేదు. దీంతో నిరాశ చెందిన విద్యార్థి నేతలు కాంగ్రెస్ పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్నారు. పీజీలు, పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలు చదివి రాజకీయ అవకాశాలకు నోచుకొని కొందరు విద్యార్థి నేతలు కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న అర్చకులు రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ

సనత్‌నగర్: శ్రీమదలర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్ల 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యుల బృంద సభ్యులచే బ్రహ్మోత్సవాలను ఘనంగా జరిపారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం చతుస్థానార్చనలు, మూలమంత్రం హోమములు, మహాపూర్ణాహుతి, కొట్నాలు, అప్పగింతలు, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, ధ్వజారోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ, పండిత సన్మానం, మహాదాశీర్వచనంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

ఆకట్టుకున్న నృత్యరూపకం



చిలకలగూడ : హోసన్నా పెంతెకోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో జరుగుతున్న సువార్త స్వస్థత సభలో గురువారం చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆహుతులను అలరించాయి. హెచ్‌పీఎఫ్ఎమ్ నిర్వాహకుడు పాస్టర్ జాయ్ నేతృత్వంలో జరుగుతున్న స్వస్థత సభల్లో పాస్టర్ జబ్‌రాజ్, చార్లెస్ జాకబ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై క్రీస్తు బోధనలు, దేవునివాక్యం వినిపించారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

రసూల్‌పురా: రసూల్‌పురా వివిధ బస్తీల్లో నెలకొని ఉన్న పలు సమస్యలను కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రసూల్‌పురా ఇందిరమ్మనగర్, శ్రీలంక బస్తీ, మజీద్ ఈ–ఇలాహీ బస్తీల్లో శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, తాగు నీరు, నిరుపయోగంగా ఉన్న పవర్ బోర్‌వెల్స్ సమస్యలు ఉన్నాయని స్థానికులు శ్రీనివాస్ దృష్టికితీసుకవచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డు వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులతో పాటు సీఈవో మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీచ్చారు. కార్యక్రమంలో కుమార్, వాహాబ్, అజ్జు, నాసర్, ముబీన్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కంటోన్మెంట్: నగరంలోని ఏకైక ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా మాదిగ వర్గానికి చెందిన వారికే ప్రధాన రాజకీయ పార్టీలు టికెట్ కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇటుక శ్రీకిషన్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో మాదిగ ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు తమ వర్గానికి టికెట్ కేటాయించడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే మే నెలలో జరిగే ఎన్నికల్లో ఆయా పార్టీల కు తమ డిమాండ్ వినిపిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్స్ ఆవరణలో మాదిగల ఆత్మగౌరవ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (ఐఐపీ) విద్యార్థులకు గురువారం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. టీఎస్‌పీసీబీ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు వారికి అవగాహన కలిన్పించారు. ఈ సందర్భంగా ప్యాకింగ్‌కు సంబంధించిన విధి విధానాలు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఐపీ హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలి



హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు వినతిపత్రం సమర్పిస్తున్న సమితి నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన సరైనదేనని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 జీహెచ్ఎంసీ డివిజన్‌లు కలిగి ఉన్న సికింద్రాబాద్‌ను జిల్లా గా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్‌రాజ్, శైలేందర్, అశోక్, కృష్ణ సాగర్, సునీల్, జగదీష్, జగ్గయ్య తదితరులు ఉన్నారు.

నూతన గవర్నర్‌కు సత్కారం



సనత్‌నగర్: నూతన గవర్నర్ రాధాకృష్ణన్‌ను హైదరాబాద్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యూత్ కన్వీనర్ మణిదీప్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ తరుపున చేస్తున్న కార్యక్రమాల గురించి గవర్నర్‌కు వివరించారు. అంతకముందు గవర్నర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

అటానమస్ అమలుపై వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అటానమస్ (స్వయం ప్రతిపత్తి) అమలు పై వర్క్ షాప్ జరిగింది. గురువారం కళాశాల ఇంటర్నల్ సెల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనిత అబ్రహం అధ్యక్షత వహించగా ఓయూ కామర్స్ ప్రొఫెసర్, చీఫ్ పీర్వో డాక్టర్ ప్యాట్రిక్ అంటోని ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. కాలేజీ గవర్నింగ్ బాడీ, అకాడమిక్ కౌన్సిల్, బోర్డాఫ్ స్టడీస్, ఫైనాన్స్ కమిటీ, ఎగ్జామినేషన్ బ్రాంచ్ వంటి విభాగాల ఏర్పాటు గురుంచి వివరంగా తెలిపారు. ఈ కొత్త విభాగాలు విభాగాల విధివిధానాలను అనుసరించి ఎలా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ బంగ్లా భారతీ, సుచిత్రసింగ్, కుమారస్వామి, నిర్మల తదితరుల పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌ను పట్టించుకోండి



ఓయూ స్విమ్మింగ్‌పూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్విమ్మింగ్‌పూల్ మూసివేతకు దారి తీస్తోంది. ప్రతి ఏటా మార్చి నెల మొదటి వారంలో ప్రారంభం కావలసిన స్విమ్మింగ్‌పూల్‌కు ఇంత వరకు అతిలేదు గతి లేదు. వేసవిలో రూ.20 లక్షల ఆదాయం సమకూర్చిపెట్టే స్విమ్మింగ్‌పూల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులు చేపట్టలేదు. మరమ్మతు పనులు చేయడానికి, నీళ్లు నింపడానికి కనీసం రెండు నెలలు పడుతుంది. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు అధ్యాపకులు, ఉద్యోగుల కొరత కారణంగా శాశ్వతంగా మూతపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన కాంట్రాక్టు ఉద్యోగులను ఇతర కార్యాలయాలకు బదిలీ చేయడం వలన సిబ్బంది కొరత ఏర్పడింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కేవలం ముగ్గురు అధ్యాపకుల కారణంగా బోధన, పరిశోధన, క్రీడా మైదనాలు, ఇండోర్ స్టేడియం, జిమ్, స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ కష్టసాధ్యమైంది.

స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎస్.రవిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యానగర్ సెంటర్‌లో బీఏ, బీకాం కోర్సులు కొనసాగుతున్నాయని ఎలాంటి విద్యార్హతలు లేకున్న ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత మార్కులు సాధించి బీఏ, బీకాం కోర్సుల్లో చేరవచ్చు అన్నారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు నేరుగా డిగ్రీలో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు చిన్నబాబు, అనిల్‌కుమార్, నర్సింగరావులు రవిప్రసాద్‌ను సన్మానించారు.

గోపాలపురం పోలీసుల కార్డన్ సెర్చ్

అదుపులో 25 వాహనాలు, ఐదుగురు రౌడీషీటర్లు

రాంగోపాల్‌పేట్: రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గోపాలపురం పోలీసులు గురువారం సాయంత్రం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఐ కాశిక్‌రెడ్డిలతో పాటు ఉత్తర మండలంలోని ఇన్‌స్పెక్టర్లు 10 మంది ఎస్సైలు, ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, 3 ప్లాటూన్స్ సాయుధ బలగాలతో రెజిమెంటల్‌బజార్‌లోని 25 లాడ్జీలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లాడ్జీలలో ఉండే వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు రికార్డుల నిర్వహణ తదితర అంశాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని లాడ్జీలలో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేస్తామని ఏసీపీ తెలిపారు. మరో మారు ఇలాంటి నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐదుగురు రౌడీషీటర్లు, ముగ్గురు సస్పెక్ట్ షీటర్లను అదుపులోకి తీసుకున్నారు. 5 డొమాస్టిక్ సిలిండర్లు కమర్షియల్‌గా వాడుతుండటంతో వాటిని స్వాధీనం చేసికున్నారు.



కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

లాలాపేట వినోభానగర్‌లో కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులు



- అధ్వానంగా డ్రైనేజీ పైపులైన్ పనులు
- పట్టించుకోని అధికారులు
- నిలిచిపోయిన రాకపోకలు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో అధికారులు పర్యవేక్షణ లేని కారణంగా సదరు గుత్తేదార్లు తమ ఇష్టాను రీతిగా అధ్వానంగా పనులు చేస్తున్నారు. అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ , చివరకు గుత్తేదారులు సైతం పనులు జరుగుతున్న ప్రాంతంలో ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్మికులే అన్నీ తామై తోచిన విధంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల లాలాపేట వినోభానగర్ చేపట్టిన డ్రైనేజీ పైపులైన్‌ల పనితీరు ఇది. ప్రజల సొమ్ముతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో చేయించాల్సిన సంబంధిత అధికారులు పత్తా ఉండటం లేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల తార్నాక హనుమాన్ నగర్, లాలాపేట ఫ్లై ఓవర్ సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినప్పటికి సరైన వాటర్ క్యూరింగ్ చేయని ఫలితంగా అక్కడక్కడా సీసీ రోడ్డుపై పగుళ్లు ఏర్పడ్డాయి. పైపులైన్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాసిరకమైన నిర్మాణ సామగ్రిని ఉపయోగిస్తూ పూర్తిగా నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు. నాసిరకంగా పనులు చేస్తే తొందరలోనే డ్రైనేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి పనులు చేయడం ద్వారా స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



మ్యాన్ హోల్ లోపలి భాగంలో సిమెంట్ చేయని వైనం

ఇంటింటికీ డబ్బులు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్

ప్రభుత్వం నిధులు వెచ్చించి చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ రోడ్డంతా తవ్వారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలోని వారి ఇండ్ల డ్రైనేజీ కనెక్షన్‌లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వాటిని తిరిగి బాగు చేయాల్సిన కాంట్రాక్టర్ ఒక్కొక్కరి ఇంటి నుంచి రూ 500 నుంచి అందిన కాడికి వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానికులకు పనులు చేస్తున్న కార్మికులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం చేస్తున్న పనికి తమ నుంచి డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని స్థానికులు నిలదీస్తే ఇంటి డ్రైనేజీ కనెక్షన్ కావాలంటే ఇవ్వాల్సిందేనని చెప్తున్నారని వినోభానగర్ వాసులు అంటున్నారు.

రాణిగంజ్ ఆర్టీసీ డీఎంగా శ్రీధర్



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ రాణిగంజ్ ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం)గా శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన లక్ష్మీ ధర్మా పదోన్నతిపై మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్‌లో పనిచేసిన శ్రీధర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి, ఇబ్బందులకు లోనుకుండా సకాలంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.

డీఎంకు సన్మానం...

రాణిగంజ్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌ను ఆర్టీసీ కార్మికులు సన్మానించారు. ఆర్టీసీ బహుజన వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, బి. శ్రీనివాస్, ఉపేందర్, సత్తయ్య తదితరులు డీఎం శ్రీధర్‌ను శాల్వకప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతి పత్రం అందచేస్తున్న బీసీ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గౌడ కార్పొరేషన్‌తో పాటు బీసీలలో వివిధ కులాల అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. గురువారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని కలసి కల్లుగీత కార్పొరేషన్ కేవల ం గీత కార్మికులకు వర్తిస్తుంది కానీ గౌడ కుల అభివృద్ధికి కాదన్నారు. పుట్ట పవన్, రాజశేఖర్, బద్రి, సంతోష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గృహిణుల అదృశ్యం



అనూష (ఫైల్)

బౌద్ధనగర్: పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాంనగర్‌లోని వైఎస్ఆర్ పార్కు సమీప ప్రాంతానికి చెందిన అనూష(25)కు ఏడేళ్ల క్రితం వినిత్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే, ఇటీవల భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో ఈ నెల 19న తన పుట్టింటికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిపోయిన అనూష కనిపించకుండా పోయింది. ఆమెకు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో భర్త వినిత్ తెలిసిన వారిని, బంధువులను కనుకున్నారు. అచూకీ తెలియకపోవడంతో వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో..



మమత (ఫైల్)

బౌద్ధనగర్: అంబర్ నగర్‌లోని గాంధీ విగ్రహం ప్రాంతానికి చెందిన మమత(33)కు శశికాంత్‌తో 2009వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు. ఈ నెల 21న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మమత బయటకు వెళ్లిపోయింది. రాత్రైనా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త తనకు తెలిసిన వారికి, బంధువులను కనుక్కున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

లోన్‌యాప్ ఎఫెక్ట్... వ్యక్తి అదృశ్యం



హమీద్ (ఫైల్)

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం. నార్త్ లాలాగూడ ప్రాంతానికి చెందిన షేక్ హమీద్(34) స్థానికంగా ఓ కిరాణా షాపు నిర్వాహకుడు. కొద్ది నెలల క్రితం భారత్ పే అనే లోన్ యాప్‌లో రూ. 40 వేలు లోన్ తీసుకున్నాడు. అందులో రూ. 20 వేలు చెల్లించి మిగతా డబ్బులు చెల్లిచడంలో జాప్యం చేశాడు. ఈ క్రమంలో భారత్ పే లోన్ యాప్ నుంచి ఫోన్ చేసి హమీద్‌ను వారి ఇష్టానుసారంగా దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన అతను బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగిరాకపోవడంతో అతని కుటుంబసభ్యులు తమకు తెలిసిన వారిని, బంధువులను వాకబు చేశారు. ఫలితం కనిపించకపోవడంతో గురువారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.